సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



సైనికుల్లా పనిచేయాలి

వచ్చే ఎన్నికల్లో కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లా పనిచేయాలని మంత్రులు కొట్టు, కారుమూరి, చీఫ్ విప్ ముదునూరి పిలుపునిచ్చారు. 8లో



ముగ్గురిపై హత్యాయత్నం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో చోటుచేసుకుంది. 8లో

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

ఎండలు ముదరడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం సాయంత్రం	సహరి మంగళవారం వేకువజాము
భీమవరం	6.24	4.36
తాడేపల్లిగూడెం	6.26	4.44
నరసాపురం	6.23	4.34

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి దుప్పల వెంకటరమణను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మ, పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయాలను ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనాలు అందించారు. దేవదాయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ఈఓ అరుణ్‌కుమార్, ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల వెంకట రామారావు, గోపిశెట్టి విజయలక్ష్మి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

సాక్షి, భీమవరం : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనసూయ చెస్ అకాడమీ స్థానిక కిడ్జ్‌ప్లే స్కూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి అండర్–17 చెస్ పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో పి.సాత్విక్ (తణుకు), ఎం.ఉద్ధవ్ (పాలకొల్లు), బాలికల విభాగంలో ఎం.దుర్గ (పాలకొల్లు), డి.భవిష్య(భీమవరం) మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ బాలుర విభాగంలో విజేతలు ఈనెల 21 నుంచి విజయనగరం జిల్లా నర్సీపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో, బాలికల విభాగంలో విజేతలు ఈనెల 20 నుంచి విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎం.మురళీ, పి.రవిప్రసాద్, శ్రీలతారెడ్డి పాల్గొన్నారు.

ఏలూరుపాడులో సినీనటుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ నటులు నరేష్, పవిత్ర లోకేష్

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడులో సినీనటులు నరేష్, పవిత్ర లోకేష్ సందడి చేశారు. ఆదివారం గ్రామంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన వారు ప్రధాన కూడలిలో ఉన్న అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భరతనాట్యం, జానపద నృత్యాలతో బాలికలు ఆకట్టుకున్నారు. ఆలయంలో స్వామివార్లకు ఉదయం స్నపనలు, సాయంత్రం సదస్యం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అర్చకులు అనిల్, కిష్టప్ప, పూర్ణయ్య, వీరబాబు పర్యవేక్షించారు.

బీమాతో ధీమా

ప్రజలపై అ'బీమా'నం

- కుటుంబానికి అండగా జగన్ సర్కారు
- కుటుంబ పెద్ద మరణిస్తే ఆర్థిక సాయం
- మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ.10 వేలు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.38.77 కోట్ల సాయం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు అండగా ఉండేందుకు జగన్ సర్కారు సంకల్పించింది. కుటుంబంలోని పెద్ద సాధారణ లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆర్థిక సాయం అందించేలా వైఎస్సార్ బీమా పథకాన్ని పటిష్టంగా అమలుచేస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ బీమా పథకం పక్కాగా అమలవుతోంది. గత ప్రభుత్వాలు బీమా చెల్లింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం చూపగా పలు కుటుంబాలకు ఆర్థిక సాయం అందలేదు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తూ బాధిత కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా కుటుంబ పెద్ద సాధారణంగా మరణిస్తే రూ.లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల చొప్పున అందిస్తున్నారు. 2021–22లో ఏలూరు జిల్లాలో రూ.16.60 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.10.04 కోట్లు అందించారు. 2022–23కు సంబంధించి ఇప్పటివరకూ ఏలూరు జిల్లాలో రూ.8.13 కోట్లు అందిస్తే, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.4 కోట్ల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. ఎప్పటికప్పుడు డీఆర్‌డీఏ సిబ్బంది ద్వారా కుటుంబ యజమాని మరణించిన కుటుంబానికి తక్షణ సాయంగా మట్టి ఖర్చుల కింద మరో రూ.10 వేలు కూడా అందిస్తూ అండగా నిలుస్తున్నారు.

2021–22లో..

2021–22లో ఏలూరు జిల్లాలో 1,907, పశ్చిమగోదావరి జిల్లాలో 1,120 మరణాలు నమోదయ్యాయి. వీటిలో సాధారణ మరణాలు ఏలూరు జిల్లాలో 1,440, పశ్చిమగోదావరి జిల్లాలో 824 నమోదు చేశారు. అలాగే ప్రమాదవశాత్తు మరణాలు ఏలూరు జిల్లాలో 44, పశ్చిమగోదావరి జిల్లాలో 36 గుర్తించారు. ఏలూరు జిల్లాలో సాధారణ మరణం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.14.40 కోట్లు, ప్రమాదవశాత్తు మరణం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.2.20 కోట్లు అందజేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో సాధారణ మరణం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.8.24 కోట్లు, ప్రమాదవశాత్తు కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.1.80 కోట్ల సాయం అందించారు. ఇలా మొత్తంగా 2,344 కుటుంబాలను వైఎస్సార్ బీమా పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంది.

2022–23లో..

2022–23లో ఏలూరు జిల్లాలో 1,154, పశ్చిమగోదావరి జిల్లాలో 827 మరణాలు నమోదయ్యాయి. సాధారణ మరణాలు ఏలూరు జిల్లాలో 548, పశ్చిమగోదావరి జిల్లాలో 752 గుర్తించారు. ప్రమాదవశాత్తు మరణాలు ఏలూరు జిల్లాలో 53, పశ్చిమగోదావరి జిల్లాలో 74 గుర్తించారు. ఇప్పటివరకూ ఏలూరు జిల్లాలో సాధారణ మరణం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.5.48 కోట్లు, ప్రమాదవశాత్తు కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.2.65 కోట్లు అందజేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో సాధారణ మరణాల్లో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.2.80 కోట్లు, ప్రమాదవశాత్తు కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు రూ.1.20 కోట్లు సాయం అందించారు.



ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రులో వరద గణపతి కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా మట్టి ఖర్చుల నిమిత్తం నగదు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

వెంటనే సాయం అందించేలా..



కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు సాయం అందించేందుకు వైఎస్సార్ బీమా తోడ్పడుతోంది. బాధిత కుటుంబాలకు అండ లభిస్తోంది. కుటుంబ పెద్ద సాధారణ మరణం చెందితే రూ.లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నాం.

– విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ, ఏలూరు జిల్లా

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన మూల్యాంకనం ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు చీఫ్ ఎగ్జామినర్, ఎగ్జామినర్లుగా నియమించిన జూనియర్ అధ్యాపకులను రిలీవ్ చేయాలని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. రిలీవ్ అయిన అధ్యాపకులు సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని తమ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. స్క్రూటినైజర్లు ఈనెల 4న ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. గతంలో మూల్యాంకన విధులు నిర్వహించి, ఈ ఏడాది ఆర్డర్ రాని ఎగ్జామినర్లు కూడా మూల్యాంకనంలో వారి పాత ఆర్డర్ కాపీ చూపి హాజరు కావచ్చని పేర్కొన్నారు.

గుబ్బల మంగమ్మకు పూజలు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతోపాటు తెలంగాణ ప్రాంతం నుంచి భక్తులు వచ్చారు.

అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా పాలన



శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజును సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, దళిత సంఘ పెద్దలు

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, దళితులంతా అండగా నిలవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భగ్గేశ్వరంలో ఆదివారం రాత్రి బీఆర్ అంబేడ్కర్ నవకళా యువజన సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన మోషేన్‌రాజును సన్మానించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ దళితులంతా విద్యావంతులై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్‌ను ప్రతిఒక్కరూ ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర దేశంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా అన్నివర్గాలకూ గుర్తింపు ఇస్తున్న నాయకుడు సీఎం జగన్ అని ప్రశంసించారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులంతా సమైక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం శాసనమండలి చైర్మన్‌ను యువజన సంఘం పెద్దలు గజమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. టీడీపీకి చెందిన తాజా మాజీ సర్పంచ్ కొయ్యే చినమాణిక్యం, కొయ్యే లక్ష్మణరావు, యువజన సంఘం పెద్దలు ఇంజేటి దేవసహాయం, కొయ్యే చంటిరాజు, సూరయ్య, రాజారత్నంతో పాటు సుమారు 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కవురు శ్రీనివాస్ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, జెడ్పీటీసీ నడపన గోవింద రాజుల నాయుడు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, డీటీడీసీ బాబు, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ



కదిలే దేవత అమ్మ.. కంటికి వెలుగమ్మా.. మాతృమూర్తి గొప్పతనాన్ని ఎంతలా వర్ణించినా తక్కువే. ఆరోగ్యం సహకరించకున్నా.. వైకల్యం వెంటాడుతున్నా.. ఏమాత్రం లెక్కచేయకుండా కన్నబిడ్డ కోసం ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేస్తోంది ఈ దివ్యాంగురాలు. ఆకివీడులోని ఎస్ టర్నింగ్ ప్రాంతంలో మండటెండలో వీపుపై బిడ్డను కూర్చోబెట్టుకుని భిక్షాటన చేస్తుండగా ఓ మహిళ వీరికి గొడుగు అందించగా, స్థానికులు ఆర్థిక సాయంతో మానవత్వం చాటారు.

–ఆకివీడు

9న గౌడ సంఘ సమావేశం

ఏలూరు (టూటౌన్): నగరంలోని కస్తూరివారి వీధిలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో ఈనెల 9న గౌడ సంఘ ముఖ్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిట్టిబొమ్మ రంగారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో గౌడ గర్జన మహాసభ జరగనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించనున్నామన్నారు. గౌడుల అభివృద్ధికి సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

కొత్త జిల్లా.. ప్రగతి భళా

- అందుబాటులో అధికారగణం
- శాశ్వత కలెక్టరేట్‌కు 20 ఎకరాలు
- చురుగ్గా వైద్య కళాశాల, ఫిషింగ్ హార్బర్ పనులు
- జిల్లాలో అభివృద్ధి పరుగులు
- రేపు రెండో ఏడాదిలోకి అడుగు



భీమవరంలో కలెక్టరేట్ భవనం

సాక్షి, భీమవరం : సుపరిపాలన, ప్రజలకు అధికారులను మరింత చేరువ చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జిల్లాల విభజనకు శ్రీకారం చుట్టారు. భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడి మంగళవారం నాటికి ఏడాది పూర్తికానుంది. గతేడాది ఏప్రిల్ 4న కొత్త జిల్లా ఏర్పడింది. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 19 మండలాలతో అవతరించగా.. ఇటీవల ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని కూడా విలీనం చేయడంతో 20 మండలాలతో జిల్లా సంతరించుకుంది. భీమవరం జిల్లా కేంద్రం ఏర్పడిన ప్పటి నుంచి కలెక్టర్, ఎస్పీతో సహా జిల్లా అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. అలాగే జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ప్రైవేట్ భవనాల్లో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ఏర్పాటుచేయగా తాజాగా సొంత భవనాల నిర్మాణానికి భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతంలో 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్లు కాగా 2,278 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సుమారు 18.45 లక్షల జనాభా ఉంది.

జిల్లాలోని మిగిలిన ప్రాంతాలకు భీమవరం 30 కిలోమీటర్లలోపు దూరంలోనే ఉండటంతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పాయి. నిత్యం అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. ఎక్కడ ఏ చిన్నపాటి సంఘటన జరిగినా వెంటనే అధికారులు అక్కడకు చేరుకోగలుగుతున్నారు. భీమవరం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపడటంతో పాటు మండలస్థాయి అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటున్నారు.

అభివృద్ధి అడుగులు

భీమవరం కలెక్టరేట్‌కు అనతి కాలంలోనే ప్రభుత్వం సకల సౌకర్యాలు, సిబ్బందిని సమకూర్చింది. జిల్లా కేంద్రం అయిన తర్వాత భీమవరంలో రోడ్ల విస్తరణ, రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణం, పట్టణ సుందరీకరణ పనులు జరిగాయి. అలాగే పాలకొల్లులో వైద్యకళాశాల, నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్, వశిష్ట వారధి, భీమవరంలో 100 పడకల ఆస్పత్రి, జిల్లావ్యాప్తంగా రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న జిల్లాల వికేంద్రీకరణ నిర్ణయం సత్ఫలితాలు ఇస్తోందని ప్రజలు అంటున్నారు.

కాలువ గట్టు.. వదిలితే ఒట్టు

- జనసేన నాయకుడి నిర్వాకం
- కేసులు నమోదు చేసినా మారని తీరు

ద్వారకాతిరుమల: కొందరు అక్రమార్కులు పోలవరం కుడి కాలువ గట్టుపై కన్నేశారు. రాత్రింబవళ్లు యథేచ్ఛగా గట్టు మట్టిని తవ్వి, విక్రయాలు సాగిస్తున్నారు. ఈ మట్టి మాఫియాలో ఒక జనసేన నాయకుడు కీలకపాత్ర పోషిస్తున్నారు. మండలంలోని గుణ్ణంపల్లిలో పోలవరం కుడికాలువ వద్ద కొన్నాళ్లుగా ఈ దందా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వివరాల ప్రకారం.. గుణ్ణంపల్లి వద్ద పోలవరం కుడి కాలువ గట్టును పొక్లయిన్‌తో తొలిచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. మట్టిని వేలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా భీమడోలు మండలానికి చెందిన ఒక జనసేన నాయకుడి కనుసన్నల్లో జరుగుతోంది. గతంలో పోలీస్ కేసులు నమోదైనా అతడిపై తీరు ఏ మాత్రం మారలేదు.

రూ.కోట్లు గడిస్తూ..

మట్టితవ్వకాల ద్వారా అక్రమార్కులతో పాటు కొందరు అధికారులు సైతం కోట్లు గడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు కాసులిచ్చి మట్టి మాఫియా అక్రమాలు సాగిస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వెంచర్ల పూడిక, చదునుకు ఈ మట్టిని వినియోగిస్తున్నారు. కాలువ గట్టు తవ్వకంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



గుణ్ణంపల్లిలో మట్టి తవ్వుతున్న ప్రాంతం

పంట పండింది

అదిరిందిరబీ

- ఆశాజనకంగా దాళ్వా సాగు
- జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో పంట
- 9.28 లక్షల టన్నుల దిగుబడి అంచనా
- జిల్లాలో మాసూళ్లు ప్రారంభం

సాక్షి, భీమవరం: దాళ్వా పంట సిరులు పండించనుంది. సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఉత్సాహంగా మాసూళ్లకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతోపాటు ఈ సీజన్‌లో వాతావరణం అనుకూలించడంతో ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో పైరు ధాన్యం కంకులతో నిండిపోయింది. ఇప్పటికే జిల్లాలోని తాడేపల్లిగూడెం, నరసాపురం ప్రాంతాల్లో వరి మాసూళ్లు ప్రారంభం కాగా.. పది రోజుల్లో ముమ్మరంగా కోతలు జరిగే అవకాశం ఉంది. జిల్లాలో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా నాట్లు వేయగా సాగునీటి ఎద్దడి తలెత్తకుండా నీటి పారుదలశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే వ్యవసాయశాఖ అధికారులు నిత్యం రైతుల వెన్నంటి ఉంటూ సూచనలు, సలహాలు ఇవ్వడంతో రబీ పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.

ధాన్యం సేకరణకు సమాయత్తం

జిల్లాలో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి నాట్లు వేయగా ఎకరాకు సగటున 45 బస్తాల వరకు దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 9.28 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసి ఆ మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత సార్వా సీజన్‌లో 5.47 లక్షల టన్నుల పంట అంచనా వేయగా.. దాళ్వాలో మాత్రం పంట ఆశాజనకంగా ఉండటంతో మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నారు. దాళ్వా పంటలో రైతులు 50 టన్నుల వరకు తమ ఆహార అవసరాల కోసం నిల్వ చేసుకుని మిగిలిన ధాన్యాన్ని విక్రయించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ధాన్యం సేకరణకు జాయింట్ కలెక్టర్ జేవీ మురళీ సమావేశం నిర్వహించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, తేమశాతం మెషీన్లు సిద్ధం చేసుకోవాలని, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు.



వీరవాసరం ప్రాంతంలో కోతకు సిద్ధమైన వరి పంట

ఎకరాకు 50 బస్తాలకుపైగా..



జిల్లాలో దాళ్వా పంట ఆశాజనంగా ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల పంట మాసూళ్లు ప్రారంభం కాగా ఎకరాకు 50 బస్తాలకు పైబడి దిగుబడి వచ్చింది. మరో 10 రోజుల్లో మాసూళ్లు ముమ్మరం కానున్నాయి. ఆలస్యంగా నాట్లు వేసిన రైతులు అనవసరంగా ఎరువులు, పురుగుమందులు వాడకుండా వ్యవసాయశాఖ అధికారులు సూచనలు పాటిస్తే పెట్టుబడులు తగ్గడమేగాక అధిక దిగుబడులు సాధించవచ్చు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం

క్లుప్తంగా

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు శివ పార్వతీపురం ప్రాంతానికి చెందిన తాళ్లూరి నాగదివ్య(25) ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఏఎస్ఐ సంజీవరావు చెప్పారు. ఆమె తల్లి శిరాలం మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గత కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త నరేష్, అత్తమామలు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోతులపై విష ప్రయోగం జరగలేదు

నరసాపురం రూరల్: తీరంలో సామూహికంగా మృతి చెందిన కోతుల మృతి విషయంపై ఫారెస్ట్ అధికారులు, వెటర్నరీ వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో విషప్రయోగం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కె ఫిరోజ్ ఆదివారం తెలిపారు. ఫిబ్రవరిలో తీరంలో ఒక సరుగుడు తోటలో సుమారు 26 కోతులు ఒకేసారి మృతి చెందిన విషయంపై అప్పట్లో కలకలం రేగింది. స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ, ఫారెస్ట్, పోలీస్, వెటర్నరీ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. వెటర్నరీ వైద్యులు కోతులకు పోస్టుమార్టం నిర్వహించి వాటి నమూనాలను విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అక్కడ నుండి వచ్చిన నివేదికలో ఎలాంటి విషప్రయోగం జరగలేదని నిర్ధారించినట్టు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఫిరోజ్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలో 13 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన కర్రి వెంకట దుర్గా దివాకర్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు భీమవరం దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ చెప్పారు. బాధిత బాలిక అమ్మమ్మ, పిన్నిలు ఈ నెల 1న వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సీఐ అడబాల శ్రీను కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేసిన డీఎస్పీ సత్యనారాయణ నిందితుడు దుర్గాదివాకర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.



తాడేపల్లిగూడెంలో సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకులో గృహ సారథులకు బ్యాగ్ అందిస్తున్న మంత్రి కారుమూరి



మొగల్తూరులో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లా పనిచేయాలి

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కన్వీనర్లు, గృహసారథులు పాత్ర వైఎస్సార్‌సిపి గెలుపునకు కీలకమని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను గృహసారథులు, కన్వీనర్లు సమన్వయంతో నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రజలను ఏవిధంగా మోసం చేశాడో తెలియచేయాలన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్న తీరును తెలియచెప్పాలన్నారు. వైఎస్సార్‌సిపి పంపిణీ చేస్తున్న కిట్లను గృహసారథుల ద్వారా పార్టీ ఆదేశాల మేరకు వినియోగించేందుకు కన్వీనర్లు బాధ్యత వహించాలన్నారు. పార్టీ కార్యకర్తలు, గృహసారథులు ప్రజలతో మమేకమయ్యేలా కన్వీనర్లు అహర్నిశలు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, కొట్టు విశాల్, మైలవరపు విశ్వేశ్వరరావు, బొద్దాని శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, బోణం విజయనిర్మల, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల ఎంపీపీలు దాసరి హైమావతి, పానుకు మాటి శేషులత తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

తణుకు అర్బన్: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గృహ సారథులు తమ విధుల్లో భాగంగా వారికి కేటాయించిన 50 ఇళ్లలో పూర్తి సమాచారాన్ని తమ వద్ద ఉంచుకోవాలని అన్నారు. అర్హులైన వారికి సంబంధిత పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు ధ్రువపరచుకోవాలని సూచించారు. గృహ సారథులకు జగనన్న బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారని, బాగా పనిచేసిన మండలానికి రూ.50 వేల బహుమతిని అందచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యేక సేవలందించాలని జగనన్న తపనను గృహసారథులు నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ వరప్రసాదరెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, సంచారజాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'పై సమీక్ష

నరసాపురం రూరల్: ఈ నెల 7 నుంచి నిర్వహించనున్న జగనన్నే మా భవిష్యత్‌పై చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదివారం మొగల్తూరులోని వెంకటేశ్వరా కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని గ్రామ సచివాలయ పరిధిలోని కన్వీనర్‌లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకు వెళ్ళి ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటిని సందర్శించి సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించామన్నారు. రాబోయే ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కార్యకలాపాలన్నింటినీ అమలు చేయడంలో గృహ సారథులు, కన్వీనర్‌లు కీలక పాత్ర పోషించాలన్నారు. నాయకులు కర్రి ఏసుబాబు, మోటుపల్లి రామ భాస్కరరావు, గుబ్బల నారాయణమూర్తి, కుక్కల కృష్ణమోహన్, పాలా రాంబాబు, తన్నీడి గిరి, కొత్తపల్లి బాబి, రంగిశెట్టి ఏసు, కొల్లాబత్తుల రవికుమార్, పడవల సత్యనారాయణ, ఏగి బాబి, కంచర్ల బాబులు, ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీల మధ్య చిచ్చు పెట్టిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మంగరాజు మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలన సమయంలో ఎస్సీల పట్ల అవమానకరంగా మాట్లాడారని, దళితులపై దాడులు, వెలివేతలు, దళితుల భూములు లాక్కోవడం తదితర ఎన్నో దుర్మార్గాలు చేశారని విమర్శించారు. ఎస్సీల మధ్య చిచ్చు పెట్టాలని చూసి భంగపడ్డారన్నారు. నేడు దళితుల మీద ఎనలేని ప్రేమ ఉన్నట్లుగా చంద్రబాబు నటిస్తున్నారని, ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో దళితులతో పాటు అన్ని వర్గాలకు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. వచ్చే 2024 ఎన్నికలలో ప్రజలను ఓటు అడిగే హక్కు జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. వైఎస్ఆర్‌సీపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తే, పార్టీ సస్పెండ్ చేస్తే నేడు శ్రీదేవికి దళిత కార్డు గుర్తుకు రావడం శోచనీయం అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో దళితుల గురించి రాయని ఈనాడు పత్రిక ఇప్పుడు దళితుల మీద మొసలి కన్నీరు కార్చుతూ, దళితులను టీడీపీ వైపునకు మళ్లించడానికి తప్పుడు కథనాలు రాస్తుందన్నారు. సమావేశంలో ఎ.అబ్రహం, టి.ప్రేమకుమార్, డి.బాబీ, వి.సునీల్, పి.మురళీ తదితరులు పాల్గొన్నారు.



మాల మహానాడు సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

ఒకే కుటుంబంలోని ముగ్గురిపై హత్యాయత్నం

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో చోటు చేసుకుంది. రాత్రంతా రక్తపు మడుగులో ఉన్న ఆ ముగ్గురిని ఆదివారం వేకువజామున స్థానికులు, బంధువులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మైసన్నగూడెం గ్రామానికి చెందిన తోణం శివ(38) వర్జీనియా పొగాకు క్యూరింగ్ పనులు చేస్తున్నాడు. అతని భార్య కూలీ పనులకు వెళ్తుంది. ఇంటికి సమీపంలోని బ్యారన్ వద్దకు శివ క్యూరింగ్‌కు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో రాడ్డుతో శివను బలంగా కొట్టారు. అక్కడ నుంచి వారు శివ ఇంటికి వచ్చి శివ భార్య చిన్ని, వారి కుమారుడు మంగరాజులపై దాడికి పాల్పడ్డారు. ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో పక్కనే మరో బ్యారన్ డ్రైవర్ వచ్చి చూడగా రక్తపు మడుగులో ఉన్న శివను గుర్తించాడు. విషయాన్ని శివ భార్యకు చెబుదామని వెళ్లి చూడగా శివ భార్య చిన్ని, కుమారుడు మంగరాజు రక్తపుమడుగులో ఉండటాన్ని గమనించాడు. బంధువులు, స్థానికులు వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శివ, చిన్ని పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ఆస్పత్రికి తరలించారు. గుంటూరులో శివ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం సీఐ బాలా సురేష్, ఎస్సై సాగర్‌బాబులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దాడికి పాల్పడేందుందుకు ఉపయోగించిన రాడ్డు చెరువులో లభ్యమైంది. డబ్బులు విషయమై హత్యాయత్నానికి పాల్పడి ఉంటారని సమాచారం. ఈ ఘటనపై వేగవరానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సీఐ మాట్లాడుతూ కుటుంబ తగదాలు, ఆర్థిక లావాదేవీలు, స్నేహితుల మధ్య గొడవల కారణంగా ఈ ఘటన జరిగి ఉంటుందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మృతి చెందిన తోణం శివ



మైసన్నగూడెంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

వైఎస్సార్ ఆసరా.. కొండంత అండ

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వైఎస్సార్ ఆసరా ద్వారా అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడ్డారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడాప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవరత్నాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలోను ఒక కొడుకులా, అన్నగా, మేనమామగా పెనవేసుకుపోయారని స్పష్టం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు వడ్డీ మాఫీని అమలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు హయాంలో విచ్చలవిడిగా దోపిడీ జరిగితే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులందరికీ సంక్షేమం అందుతుందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులను అక్కచెల్లెమ్మలందరూ ఆలోచించాలని, ఒకటికి రెండుసార్లు మననం చేసుకోవాలని సూచించారు.

దూరదృష్టితో ఆలోచిస్తున్న సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దూరదృష్టితో ఆలోచించే వ్యక్తిత్వం కలిగిన మనిషని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ప్రతి ఒక్కరి సమస్య ఓపికగా వింటూ ఆ సమస్య పరిష్కారానికి కృషిచేసే మంచి మనస్సున్న వ్యక్తిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా చెక్కు నమూనాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎంపీపీ ఆర్ ధనరాజు, జెడ్పీటీసీ ఎం.అన్నపూర్ణాదేవి, నాయకులు బోడపాటి వీర్రాజు, ఇందుగపల్లి బలరామకృష్ణ, జంగం ఆనంద్‌కుమార్, పోతేపల్లి వెంకట ప్రసాద్, ఉండవల్లి జానకి, పెన్మెత్స రామరాజు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, డ్వాక్రా మహిళలు

భీమవరంలో మలబార్ గోల్డ్ షోరూం పునఃప్రారంభం

సాక్షి, భీమవరం: పట్టణంలో సరికొత్తగా ముస్తాబైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు శనివారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ అతిపెద్ద బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షాపును భీమవరంలో ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ మాట్లాడుతూ పట్టణంలో సరికొత్తగా ముస్తాబు చేసిన షోరూంలో వెరైటీ డిజైన్లతో పాటు, 4.9 శాతం నుంచి ప్రారంభమయ్యే తరుగు చార్జీలతో ఆభరణాలు లభిస్తాయన్నారు. ప్రత్యేకంగా ఎంపిక చేసిన వజ్రాభరణాలు, విలువైన రత్నాల ఆభరణాలు వంటివి కూడా అందుబాటులో ఉంటాయన్నారు. గ్రూపు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా లాభాలలో 5 శాతం ఈ ప్రాంతంలో వివిధ ధార్మిక, దాతృత్వ కార్యకలాపాలకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సంస్థ ప్రతినిధి అర్జున్, భీమవరం స్టోర్ హెడ్ ఇంతియాజ్, నిఖిల్ చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలుదారులకు అభరణాలు అందిస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు తదితరులు

బెట్టింగ్‌లో నష్టపోయిన వ్యక్తి ఆత్మహత్య


తణుకు: క్రికెట్ బెట్టింగుల్లో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తణుకు రైల్వే అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన పత్తిగిల్లి దుర్గాప్రసాద్ (33) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నారు. దీంతోపాటు ఇటీవలి క్రికెట్ బెట్టింగులకు పాల్పడ్డాడని, ఈ క్రమంలో అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. రూ. 1.60 లక్షలు అప్పు తండ్రి తీర్చినట్లుగా సమాచారం. ఇటీవల ఐపీఎల్ మొదలయ్యాక క్రికెట్ బెట్టింగుల్లో పెద్ద మొత్తంలో నష్టపోవడంతో మనస్తాపం చెందిన దుర్గాప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు పట్టాలపై మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



దుర్గాప్రసాద్(33)

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- వేసవిలో గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ, గవద బిళ్లల కేసులు
- పిల్లలకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు




పెంటపాడు: వేసవి ప్రారంభమైంది. మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. దీంతోపాటు పలు వ్యాధులూ ప్రబలుతున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో చికెన్‌పాక్స్ (ఆటలమ్మ), పొంగు, గవద బిళ్లల సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయస్సుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్త చర్యలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో చిన్నారులకు ఆటలమ్మ సోకుతోంది. చిన్నపిల్లలు సరిగా చెప్పలేక సతమతమవుతుంటారు. వారి సమస్యలను పెద్దలు గుర్తించి తగు చికిత్స అందించాలి. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువ. వీరి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆటలమ్మ, గవద బిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్ యాంటీబయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లక్షణాలు

ఆటలమ్మ సోకిన పిల్లలను మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవద బిళ్లలు వచ్చినవారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. చికెన్ పాక్స్, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢ నమ్మకాలతో వైద్యసహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందంటున్నారు. అసలు ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు, పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.

– ఎస్వీ రమణ, పీహెచ్‌సీ వైద్యాధికారి, ముదునూరు

మూఢ నమ్మకాలొద్దు



వేసవిలో వచ్చే వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. మూఢ నమ్మకంతో వైద్యం అందించకపోతే ప్రమాదం. ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. వ్యాధి తగ్గే వరకూ వైద్యుల సలహాలు పాటించాలి.

– వి.మౌనిక, మెడికల్ అధికారి, పెంటపాడు పీహెచ్‌సీ

క్లుప్తంగా

ముత్యాలమ్మ సేవలో వరప్రసాద్‌రెడ్డి



టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం శ్రీముత్యాలమ్మ వారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అరిమండ వరప్రసాద్ రెడ్డి, సీఈఓ కె.శివనాయుడులు దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికగా, వారు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు వారికి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వంక రవీంద్రకు అభినందనలు



తణుకులో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న సీపీఐ నాయకులు

తణుకు టౌన్: ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పారిశ్రామికవేత్త వంక రవీంద్రనాథ్‌ను సీపీఐ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం సాయంత్రం తణుకులోని వంక రవీంద్రనాథ్ నివాసంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిపిఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు టీ అప్పలస్వామి తదితరులు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు.

172 మందికి వైద్య పరీక్షలు



రక్త పరీక్ష శిబిరంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఆదివారం లయన్ పచ్చిగోళ్ళ శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో కడకట్ల గొల్లగూడెం సెంటర్‌లోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో షుగర్ వ్యాధి నిర్ధారణ ఉచిత రక్త పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. 172 మంది పరీక్షలకు హాజరై ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. అధ్యక్షులు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ వి.రామ్మోహన్‌రావు, కోశాధికారి చిన్నం జగదీష్ పాల్గొన్నారు.

రామాలయంలో విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేటలోని రామాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మహిళా కమిటీ వారితో విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, జిల్లా ఉపాధ్యక్షులు నరిశే సోమేశ్వరరావు, సమరతా సేవ సంఘం సభ్యులు చల్లా వెంకటేశ్వరశర్మ, పచ్చిపులుసు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

కేంద్రం వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

పెంటపాడు: రైతులు, కౌలురైతుల సమస్యలపై ఈనెల 5న ఢిల్లీలో జరగబోయే సమావేశానికి పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద జీపు యాత్ర పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు శిరపరపు రంగారావు, మాదాసు రమేష్, కూసంపూడి చందు, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు వేళాయె..!

తాడేపల్లిగూడెం రూరల్: పది పరీక్షలకు సమయం ఆసన్నమైంది. సోమవారం నుంచి ఈ నెల 18 వరకూ పది పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇప్పటికే 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష ముగుస్తుంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 67 స్కూల్స్ నుంచి మొత్తం 3828 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉంది. తాడేపల్లిగూడెం పట్టణం ఎనిమిది, రూరల్ ఐదు, పెంటపాడు మండలం నాలుగు వెరసి మొత్తం 17 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 140 మంది ఇన్విజిలేషన్ సిబ్బంది పని చేయనున్నారు. టౌన్‌లో 88 మంది, రూరల్‌లో 52మంది విధుల్లో ఉంటారు. అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాల్సి ఉంది. హాల్ టిక్కెట్, పరీక్షా సామగ్రి మినహా ఎటువంటి సామగ్రిని అనుమతించరు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



వల్లూరుపల్లిలో మట్టల ఆదివారం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



దువ్వలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ చేస్తున్న విశ్వాసులు

పెంటపాడు: ఏసుక్రీస్తు శిలువ శ్రమల గుర్తుగా గుడ్‌ఫ్రైడేకు 5 రోజులు ముందుగా వచ్చే మట్టల ఆదివార వేడుకలు నియోజకవర్గంలోని పలు చర్చిలలో ఘనంగా నిర్వహించారు. గూడెం టౌన్ ఎ.క్లాస్ ఫ్యారిష్ చర్చిలో గురుమండల అధ్యక్షులు కె.విజయరాజు, చర్చి పాలకవర్గ సభ్యులు, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యుల ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం లోర్యాలీ నిర్వహించారు. చర్చి నుంచి పోలీస్‌స్టేషన్, బస్టాండ్ సెంటర్, తాలూకా కార్యాలయం, బ్రిడ్జి సెంటర్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గురుమండల అధ్యక్షులు కె. విజయరాజు మాట్లాడుతూ సమస్త మానవాళికోసం ఏసుక్రీస్తు శిలువ శ్రమలు భరించారన్నారు. అలాగే కొండాయి చెరువు ప్రాంతంలో



తాడేపల్లిగూడెంలో టౌన్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో మట్టలతో ఊరేగుతున్న దృశ్యం

ఫెయిత్ చర్చిలో రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్, వల్లూరుపల్లి ప్రార్థనా కేంద్రంలో పాస్టర్ జమాయమ్మ, జాయ్‌బాబు, గూడెం ఎల్ఎల్ఎం చర్చిలో మల్లిపూడి జైబాబు, యోరీజై, ముదునూరుపాడు చర్చి లో బైబిలు మిషను నాయకులు దైవారావు, గొల్లగూడెం సెంటర్‌లో పాస్టర్ ఎజ్రా, గూడెం టీచర్సు కాలనీలో జీజెస్ బిలీవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మానుకొండ డల్లా, గూడెం, పెంటపాడు, రూరల్ గ్రామాలలోని ప్రార్థనాకేంద్రాలలో మట్టల ఆదివార వేడుకలు ఘనంగా నిర్వహించారు.

తణుకులో

తణుకు టౌన్: ఏసు క్రీస్తు ఏరుషలేములోని దేవాలయ ప్రవేశాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు జరుపుకునే మట్టల ఆదివారం వేడుకలను తణుకు మండలంలోని వివిధ చర్చిలలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జామునే క్రైస్తవ విశ్వాసులు వివిధ పూలను అలంకరించిన ఈత, తాటి ఆకులను చేతబట్టి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహిస్తూ చర్చిలలోకి ప్రవేశించి ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని దువ్వ గ్రామంలోని రక్షణ సైన్యం, వేల్పూరులోని సెయింట్ పాల్స్ లూథరస్ చర్చి, తణుకు పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలతో పాటు ఇంకా పలు చర్చిలలో భక్తులు ఆకులతో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేల్పూరులోని సెయింట్ పాల్స్ లూథరస్ చర్చి పాస్టర్ తాతపూడి కృపానిధి, దువ్వ గ్రామంలో రక్షణ సైన్యం చర్చి పాస్టర్ సురేష్, సంఘ పెద్దలు వరదరాజు, కోటి, ఆనంద్ పాల్గొన్నారు.

కరికాల భక్త సంక్షేమ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కరికాల భక్త సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కరికాల భక్త సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ఉపాధ్యక్షుడు సంగడి వెంకట ఈశ్వర దేవయ్య తెలిపారు. ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని వీవర్స్ కళ్యాణ మండపంలో నిర్వహించిన కరికాల భక్త సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈసమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బైరెత్తి శ్రీనివాస్ (కవిటం), ఉపాధ్యక్షులుగా సంగడి వెంకట ఈశ్వర దేవయ్య (వేల్పూరు), ప్రధాన కార్యదర్శిగా ముత్యాల గణపతి (కొవ్వూరు) తదితరులను ఎన్నుకున్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

తణుకు టౌన్: మండలంలోని మండపాక గ్రామంలో ద్వారకాతిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి మండపాక గ్రామంలో శ్రీ యల్లారమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో రాష్ట్ర పౌర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆయన సతీమణి లక్ష్మీ కిరణ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని కల్యాణోత్సవాలను ప్రారంభించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, విజయలక్ష్మీల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాలను నిర్వహించారు. ద్వారకాతిరుమల ఆలయ సూపరింటెండ్ ఎంవీకే సుబ్రహ్మణ్యం, ఆలయ అర్చకులు జనార్ధనాచార్యుల శిష్య బృందం వేద మంత్రోచ్ఛారణలతో కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల ట్రస్టీ బోర్డు సభ్యురాలు బోడపాటి మౌనిక, సొసైటీ చైర్మన్ వై.విజయామూర్తి, శ్రీ



మండపాకలో స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులు



చుక్కావారి తోటలో తక్కిళ్లమ్మను దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి

యల్లారమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల మణికంఠ, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు పాల్గొన్నారు. అలాగే మండపాకలోని వేంచేసియున్న శ్రీ యల్లారమ్మవారి జాతర మహోత్సవాలలో బాగంగా ఆదివారం సాయంత్రం రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటేశ్వరరావు సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తక్కిళ్లమ్మను దర్శించుకున్న కారుమూరి

ఇరగవరం: రాష్ట్రంలోని ప్రజలు అందరు బాగుండాలని రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యహరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు ఆదివారం మండలంలోని రేలంగి శివారు చుక్కావారి తోటలో వేంచేసి ఉన్నా గ్రామా దేవత తక్కిళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట కార్యక్రమంలో సర్పంచ్, చేబ్రోలు స్వరాజ్యం, గ్రామా పార్టీ అధ్యక్షులు పులుపు అనిల్, బొక్కా గోవిందా రాజు, చేబ్రోలు పెద్దిరాజు, మైనంపాము, వడ్డే మార్కెండేయులు, కాసాగాని సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



తణుకులో టెన్త్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: టెన్త్ విద్యార్థినులకు పరీక్షా సామగ్రి అందించిన ఆల్ ఇండియా పూలే, అంబేడ్కర్ ఫౌండేషన్ నాయకులు అభినందనీయులని తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. తణుకు పాతవూరులోని ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థినులకు టెన్త్ పరీక్షా సామాగ్రిని ఫౌండేషన్ వ్యవస్థాపకులు, న్యాయవాది పొట్ల సురేష్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, నత్త కృష్ణవేణి, పెనుమాల రాజేష్, సిర్రా జాను, విప్పర్తి రాజశేఖర్, హాస్టల్ వార్డెన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా వరి కోతలు



కొండ్రుప్రోలు ఆయకట్టులో యంత్రాలతో వరి కోతలు కోస్తున్న దృశ్యం

- ఏపుగా పంట పెరగడంతో అన్నదాతల ఆనందం
- పచ్చిపైనే ధాన్యం 75 కిలోల బస్తా రూ.1140లు ధర

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో దాళ్వా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక పక్క వాతావరణం, మరో పక్క పంట చేతికి రావడం వంటి కారణాలతో వాతావరణ మార్పుల నుంచి పంటను గట్టెక్కించుకోవడం కోసం గత రెండ్రోజులుగా మెషీన్లతో కోతలు కోస్తున్నారు. ప్రధానంగా ఎస్ఎల్ 126, సంపత్ స్వర్ణ, పీఆర్‌పీ రకాలను రైతులు సాగు చేశారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుని నిలబడగలిగే వరి వంగడాలు కావడంతో రైతాంగం ఈ వంగడాలపై దృష్టి సారించారు. పంట కూడా బాగా పండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. ఎకరానికి గతం కంటే ఎక్కువగానే దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. పచ్చిపైనే ధాన్యం 75 కిలోల బస్తా రూ.1140లు ధర పలుకుతుంది. గత సీజన్ కంటే మెరుగైన ధర లభించడంతో రైతుల్లో సైతం ఆనందం వ్యక్తమవుతుంది. గత మూడ్రోజులుగా వాతావరణం గంభీరంగా ఉండటంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనే ఆందోళనతో కోతల ప్రక్రియను వేగిరపర్చారు. వాతావరణం మారకుండానే పంటను కోసి గట్టెక్కించాలనే ఉద్దేశ్యంతో కోత యంత్రాలతో వేగంగా కోతలు కోయిస్తున్నారు. ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, మోదుగ గుంట, గొల్లగూడెం, చినతాడేపల్లి, పెదతాడేపల్లి, కడియద్ద, నీలాద్రిపురం, కృష్ణాపురం, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం తదితర గ్రామాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

దిగుబడులు ఆశాజనకం

దాళ్వా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి 50 బస్తాలు దాటి దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. పచ్చిపైనే ధాన్యం 75 కిలోల బస్తా రూ.1140లు పలుకుతుంది. ధర కూడా గత సీజన్‌తో పోలిస్తే బాగుంది.

– గొన్నూరి వెంకటేష్, కౌలు రైతు, కొండ్రుప్రోలు

గోపాలస్వామికి శ్రీ చక్రస్నానం



బైరాగిమఠంలో చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు బైరాగిమఠంలోని గోపాలస్వామివారి ఆలయంలో గత 10 రోజులనుండి సాగుతున్న వసంత నవరాత్రి, శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం స్వామివారికి నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కోనేరు చెరువులో చక్రస్నానం, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠిలు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి సీతారాములకు శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ చీమలకొండ సాయి, సూపరెండెంట్ కొండవీటి నాగబాబు తదితరులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలలో గ్రామస్తులతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామనవమి పురస్కరించుకొని శనివారం రాత్రి తెప్పోత్సవం అనంతరం స్వామివార్లను ఆంజనేయస్వామి వాహనంపై ఊరేగించారు.

మెట్టినింటికి చేరిన గార్లమ్మ



అమ్మవారి గరగల వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామంలో ఉన్న గార్లమ్మ వారు ఆదివారం ఉదయం మెట్టినిల్లు అయిన ఆలయానికి చేరుకున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఆలయం నుంచి గ్రామంలోని పుట్టినింటికి వెళ్లారు. ఉత్సవాలు ముగియడంతో తిరిగి అమ్మవారిని ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా గ్రామంలో గరగలతో గ్రామోత్సవం నిర్వహించారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో బాగంగా ఆదివారం తణుకులో సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆశ్రమం వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ ొండాడ వెంకటేశ్వర్లు ఆశ్రమం వద్దకు వెళ్లి ఆశ్రమం వున్న 40 మందికి చెవి, 30 మందికి దంత సంబంధిత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండపాక గ్రామానికి చెందిన కొడమంచిలి సుబ్బలక్ష్మీ పేరున ఆమె భర్త గోపాల కృష్ణ మూర్తి అందించిన ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.